క్లుప్తంగా

వీధి వ్యాపారులను సర్వే చేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలి

నేషనల్ అసోసియేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండర్స్ ఆఫ్ ఇండియా కో ఆర్డినేటర్ రాజు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరంలో సమగ్ర సర్వే చేసి వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని నేషనల్ అసోసియేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండర్స్ ఆఫ్ ఇండియా కోఆర్డినేటర్ రాజు మున్సిపల్ ఉన్నతాధికారులను కోరారు. ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో సుమారు 10 నుంచి 15 వేల మంది వీధి వ్యాపారులు ఉన్నారని, వీరంతా ఎటువంటి భరోసా లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్ట్రీట్ వెండర్స్ పరిరక్షణ చట్టం 2014 ప్రకారం ఐదేళ్లకోసారి సర్వే నిర్వహించాల్సి ఉందన్నారు. ఇది పూర్తి చేసి సౌకర్యాలు కల్పించాలని కోరారు. విజయవాడ హాకర్స్ యూనియన్ నాయకులు చౌదరి మురళి మాట్లాడుతూ వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు, వెండింగ్ లైసెన్సులు జారీ చేయాలన్నారు. సమావేశంలో బీసెంట్ రోడ్డు హాకర్స్ యూనియన్ నాయకులు దామోదరరావు, కుమార్, ప్రసన్న దత్త, భీమేశ్వరరావు, సూరమ్మ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు భద్రతా దళ దినోత్సవం



పాయకాపురం(విజయవాడరూరల్): భారతదేశానికి సమర్థమైన భద్రతా దళాలున్నాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ అన్నారు. 61వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం సరిహద్దు భద్రత దళదినోత్సవం జరిగింది. తోట శ్రీనివాస్ పార్టీ నేతలతో కలిసి భద్రత దళాల చిత్రపటం వద్ద వందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సరిహద్దులో ఉగ్రవాదుల చొరబాట్లు, మాదక ద్రవ్యాల రవాణా ద్వారా దేశానికి హాని కలిగించే కుట్రలను సరిహద్దు భద్రతా దళం తిప్పికొడుతుందన్నారు. దేశ భద్రతలో మహిళా శక్తి పెరగడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, అన్నపురెడ్డి రామిరెడ్డి, సీహెచ్ రాజా, కోట పవన్ కుమార్, డి.భరద్వాజ్, సుభాని, ఓంకార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల పోటీల్లో 'ఎస్ఆర్ఆర్' సత్తా



మధురానగర్(విజయవాడసెంట్రల్): కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాల పురుషుల వాలీబాల్ పోటీల్లో ఎస్ఆర్ఆర్ కళాశాల క్రీడాకారులు ద్వితీయ స్థానంలో నిలిచి సౌత్‌జోన్ పోటీలకు ఎంపికయ్యారు. ఫుట్‌బాల్ అంతర్ కళాశాల పోటీల్లో కూడా ఎస్ఆర్ఆర్ క్రీడాకారులు ద్వితీయస్థానంలో నిలిచి సత్తాచాటారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి, వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ ఎం.కోటేశ్వరరావు, డాక్టర్ యుగంధర్ అభినందించారు. వాలీబాల్‌లో మహేష్, విజయ్ ఫుట్‌బాల్‌లో ఎస్. ప్రదీప్ కుమార్, పి. ప్రదీప్, బి. దుర్గాప్రసాద్, రిషి, ఎం. తేజ, పి. అజయ్ కుమార్ సౌత్‌జోన్ పోటీలకు అర్హత సాధించారు

రేపు ఘంటసాల చిత్రగీతాల పోటీలు

విజయవాడ కల్చరల్: శ్రీధర్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఘంటసాల వెంకటేశ్వరరావు 101 జయంతి సందర్భంగా రాష్ట్రస్థాయి ఘంటసాల పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు మంగరాజు తెలిపారు. గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. 3వ తేదీ ఆదివారం 2 గంటల నుంచి కౌతా పూర్ణానందం కళావేదికపై పోటీలు ప్రారంభమవుతాయన్నారు జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని వివరాలకు 83319 27473, 94923 77473 నంబర్లలో నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, దండు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: నవరస నటుడు చంద్రమోహన్ అని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, కామ్రేడ్ జీఆర్‌కే సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో సినీ నటుడు చంద్రమోహన్ సంస్మరణ సభ, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ కళాభారతి వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు బోడి ఆంజనేయరాజు, చీదెళ్ళ నాగేశ్వరరావు ప్రసంగించారు. గాయనీ గాయకులు చంద్రమోహన్ నటించిన చిత్రాల్లో పాటలను ఆలపించారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

జగన్‌తోనే జనరంజక పాలన

సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల బోర్డును ప్రారంభిస్తున్న మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే జనరంజక పాలన సాధ్యమని.. జన సంక్షేమమే ధ్యేయంగా పారదర్శకంగా పాలన చేస్తున్నారని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 28వ డివిజన్ శ్రీనగర్ కాలనీలోని 212వ వార్డు సచివాలయ పరిధిలో శుక్రవారం జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి కనపర్తి కొండాతో కలిసి ఆయన పాల్గొన్నారు. తొలుత పార్టీ జెండాను ఎగరవేసి, అనంతరం సచివాలయం వద్ద సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల బోర్డును ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న సంక్షేమ పథకాలు, నగదు బదిలీలు గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. తన 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో చంద్రబాబు పేదలు, మహిళల ఆర్థికాభివృద్ధిపై ఏనాడూ ఆలోచించలేదని విమర్శించారు. టీడీపీ హయాంలో బడ్జెట్ భారీగా ఉన్నా.. ఆ నిధులన్నీ టీడీపీ నేతల జేబుల్లోకి, జన్మభూమి కమిటీ సభ్యుల ఇళ్లకు చేరాయని ఆరోపించారు. సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని చెప్పుకొచ్చారు. 212 వ వార్డు సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో డీబీటీ ద్వారా 1,316 మందికి రూ.4,69, 45,945 లబ్ధి చేకూర్చగా.. నాన్ డీబీటీ ద్వారా 510 మందికి రూ.3,13,86,210 మేలు కలిగించినట్లు వెల్లడించారు. మొత్తంగా 1,826 మందికి రూ.7,19,53,639 లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. 2019 లో టీడీపీ అధికారం దిగిపోయే నాటికి ఏపీ వృద్ధిరేటు పరంగా దేశంలో 16వ స్థానంలో ఉండేదని.. కానీ ఈ నాలుగున్నరేళ్లలో 50 శాతం జీఎస్‌డీపీ వృద్ధిని నమోదు చేసి నాలుగో ర్యాంక్‌కి చేరుకున్నట్లు వెల్లడించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో 29వ డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, కంభం కొండలరావు, నాయకులు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

లబ్బీపేట(విజయవాడతూర్పు): వై ఏపీ నీడ్స్ జగన్న కార్యక్రమం శుక్రవారం 24వ డివిజన్‌లోని గిరిపురం 91 వ వార్డు సచివాలయ పరిధిలో జరిగింది ఈ సందర్భంగా సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ కుక్కల అనితతో కలిసి తొలుత సచివాలయంలో ఆ ప్రాంతంలో అందించిన సంక్షేమ పథకాలతో కూడిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సమీపంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పార్టీ పతాకాన్ని ఎగరవేశారు. అనంతరం ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ 91వ వార్డు సచివాలయం పరిధిలో నాలుగున్నరేళ్లలో డీబీటీ ద్వారా 1,604 మందికి రూ 4 .80 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా 426 మందికి రూ.95.30 లక్షలు మేలు చేకూర్చినట్లు తెలిపారు. సచివాలయం పరిధిలో మొత్తంగా రూ.5.75 కోట్లు లబ్ధి చేకూర్చినట్లు వెల్లడించారు. నేత కుక్కల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

59వ డివిజన్‌లో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): అజిత్‌సింగ్‌నగర్‌లోని 254 వ వార్డు సచివాలయ పరిధిలో శుక్రవారం జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, స్థానిక కార్పొరేటర్ ఎండీ షాహినా సుల్తానా హఫీజుల్లా పాల్గొన్నారు. తొలుత మాకినేని బసవపున్నయ్య స్టేడియం వద్ద పార్టీ జెండాను ఎగురవేసి, వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వార్డు సచివాలయంలో సంక్షేమ కార్యక్రమాల బోర్డును ఆవిష్కరించారు. 254 వ వార్డు సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో డీబీటీ ద్వారా రూ. 10, 51, 57, 12 మేలు చేకూర్చగా.. నాన్ డీబీటీ ద్వారా రూ. 8,96,47,761 మొత్తంగా రూ.19, 48,04,773 లబ్ధి చేకూర్చినట్లు మల్లాది విష్ణు వెల్లడించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే ఇందిరానాయక్‌నగర్ అభివృద్ధి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీతోనే ఇందిరానాయక్‌నగర్ అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి కాలనీ ఆర్చిని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని పట్టించుకోకుండా, పూర్తి నిర్లక్ష్యానికి గురిచేసిందని తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఇందిరానాయక్‌నగర్‌పై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు రూ.22 కోట్ల నిధులను డివిజన్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసినట్లు వివరించారు. ఆర్చి నిర్మాణానికి ఎమ్మెల్యే అందించిన తోడ్పాటును మరువలేమని ఈ సందర్భంగా కాలనీవాసులు తెలియజేశారు. అనంతరం మల్లాది విష్ణుని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో 29వ డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, కాలనీ సెక్రటరీ రామారావు, ట్రెజరర్ గౌతమ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

శివగిరిపై కార్తిక పూజలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక శివగిరిపై కార్తిక మాసం సందర్భంగా శుక్రవారం శివలింగానికి రుద్రాభిషేకం, కుంకుమార్చన, సహస్ర లింగార్చన, రుద్రహోమం, ప్రదోష పూజ, శివకల్యాణం జరిగాయి. భవానీ దీక్షలు ధరించిన హిజ్రాలు శివగిరిని సందర్శించి శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం జరిగిన అన్నదానంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇక్కడ జరుగుతున్న పూజలను శివగిరి వ్యవస్థాపకుడు మల్లికార్జునశర్మ పర్యవేక్షించారు.

పింఛన్ల పంపిణీలో దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



వలంటీర్లుతో కలిసి పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ అనిత



32వ డివిజన్‌లో పింఛన్ అందజేస్తున్న వలంటీర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): పింఛన్ల పంపిణీలో దేశానికే ఆదర్శంగా ఏపీ నిలుస్తోందని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు 24వ డివిజన్ సీతారామపురంలో శుక్రవారం స్థానిక కార్పొరేటర్ కుక్కల అనితతో కలిసి ఎమ్మెల్యే విష్ణు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో కొత్త పింఛన్ మంజూరు కావాలంటే అవ్వాతాతలు పడిన పాట్లు వర్ణనాతీతమని, వారు పడిన ఇబ్బందులను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏళ్లు గడిచినా దరఖాస్తు కదిలేది కాదని.. ఆత్మాభిమానాన్ని చంపుకొని చివరకు జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత చిన్న కష్టం కూడా తెలియకుండా, ప్రతి నెలా ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి అందిస్తున్నట్లు వెల్లడించారు. పింఛన్ అర్హతను 65 నుంచి 60 ఏళ్లకు తగ్గించిన ఘనత కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో టీడీపీ హయాంలో కేవలం 39 లక్షల మందికి మాత్రమే పింఛన్లు అందేవని, నేడు 65.33 లక్షల మందికి అందిస్తూ నెలకు రూ 1,800 కోట్లు వెచ్చిస్తున్నట్లు మల్లాది విష్ణు వెల్లడించారు. నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో 17 వేలు ఉన్న పింఛన్లను నేడు 26,419 పెంచి ప్రతినెలా రూ7.39 కోట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. కొత్త సంవత్సరంలో ఈ పింఛన్ ను రూ. 3 వేలుకు పెంచబోతున్నట్లు తెలియజేశారు. పీఓయూసీడీ రోహిణి, సీడీఓ జగదీశ్వరి పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్‌లో శుక్రవారం తెల్లవారుజామునుంచే వలంటీర్ లక్ష్మి పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్ పాల్గొన్నారు.

స్మృతివనాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ ఢిల్లీరావు



స్మృతివనం సుందరీకరణ పనులను పరిశీలించిన కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రాంగణం, స్మృతివనాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. స్వరాజ్య మైదానంలో ప్రతిష్టాత్మకంగా నిర్మితమవుతున్న 125 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం పనులను ఆయన అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా చేపట్టిన అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం ప్రాంగణాన్ని పచ్చదనంతో అందంగా తీర్చిదిద్దాలన్నారు. సందర్శకులు స్మృతివనంలోకి అడుగుపెట్టగానే ఆకట్టుకునేలా ఉండాలన్నారు. రాజ్యాంగ ఔన్నత్యానికి, ఐక్యతకు, సామరస్యానికి నెలవైన ప్రాంగణం ప్రశాంత వాతావరణానికి వేదికగా ఉండేలా తీర్చిదిద్దాలని సూచించారు. స్మృతివనం ప్రాజెక్ట్ ఆర్కిటెక్చర్ సత్యనారాయణ, ప్రాజెక్ట్ మేనేజర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి



ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



దుర్గాపురంలో అవగాహన ర్యాలీ



గురుకుల కళాశాలలో విద్యార్థుల పోస్టర్ ప్రజెంటేషన్

పాయకాపురం(విజయవాడరూరల్): ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన ఉండాలని ప్రధానోపాధ్యాయుడు డి. మోహన్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా శుక్రవారం పుచ్చపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు మోహన్ మాట్లాడుతూ ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): హెచ్ఐవీ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని దుర్గాపురం ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ గౌతమ్ అన్నారు. దుర్గాపురంలో శుక్రవారం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన ప్రపంచ ఎయిడ్స్ దినం పురస్కరించుకుని అవగాహన ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు బ్రహ్మదేశం వసంతకుమార్, కార్యదర్శి కొండాయ గుంట రాము, విల్సన్ రాజు, పసుపులేటి రమేష్, సాయి, సుకన్య, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాత ప్రభుత్వాసుపత్రిలో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): హెచ్ఐవీ సోకినవారు పౌష్టిక ఆహారం ఏఆర్‌టీ చికిత్స ద్వారా జీవన ప్రమాణం పెంపొందించుకోవచ్చని ఏఆర్‌టీ సెంటర్ వైద్యాధికారి గౌతం అంబేడ్కర్ అన్నారు. పాత ప్రభుత్వాసుపత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్‌దినం పురస్కరించుకుని హెచ్ఐవీ బాధితులకు ఫార్మసిస్ట్ మోపిదేవి కోకిలాంబ సహకారంతో పండ్లు, బిస్కెట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. కౌన్సిలర్లు వరప్రసాద్, ముడబలిమి భాస్కరరావు, మంతెన సౌజన్య, లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రపంచ ఎయిడ్స్ దినం పురస్కరించుకుని శుక్రవారం మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు జరిగాయి. అనంతరం వాసవ్య మహిళా మండలి కౌన్సిలర్ సుభాషిణి హెచ్ఐవీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన టి.అనూష, ఎన్. బేబిలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ సమన్వయకర్త సుధారాణి, ఎన్ఎస్ఎస్ అధికారి ఏ ఎల్ లావణ్య డాక్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ కళాశాలలో..

మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్‌సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్‌దినం పురస్కరించుకుని అవగాహన ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కొల్లేటి రమేష్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ కో ఆర్డినేటర్ కేవీఎస్ ప్రసాద్, రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, అవుతు శ్రీశైలజ

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58 వ డివిజన్ 240వ వార్డు సచివాలయ పరిధిలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకు వెళ్లి స్థానిక సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకోవటంతో పాటు ప్రభుత్వ పథకాలను వివరించారు. గత చంద్రబాబు అవినీతి పాలనకు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనకు మధ్య వ్యత్యాసాన్ని బుక్‌లెట్ల ద్వారా స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా అవ్వాతాతలకు పింఛన్లను పంపిణీ చేశారు. చంద్రబాబు పాలనలో ఎన్నికల ముందు వరకు కేవలం రూ.వెయ్యి మాత్రమే పింఛన్ ఇచ్చే వారని గుర్తుచేశారు. కానీ నేడు ఒక్కొక్కరికీ రూ.2,750 చొప్పున అందిస్తుండటంతో అవ్వాతాతల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోందని చెప్పారు. కొత్త సంవత్సరం నుంచి ఈ పింఛన్ ను రూ. 3 వేలుకు పెంచబోతున్నట్లు తెలియజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. టీడీపీ హయాంలో అందించిన పింఛన్లపై శ్వేతపత్రాన్ని విడుదల చేసే దమ్ము పచ్చ నేతలకు ఉందా..? అని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రశ్నించారు. కార్యక్రమంలో ఈఈ(ఇంజినీరింగ్) శ్రీనివాస్, ఏఎంఓహెచ్ డాక్టర్ రామకోటేశ్వరరావు, నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, శర్మ, తోపుల వరలక్ష్మి, శోభన్, నేరెళ్ల శివ, మహేశ్వరి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేరంటాలమ్మ ఆలయంలో టెండర్ల స్వీకరణ



సీల్డ్ టెండర్లు స్వీకరిస్తున్న అధికారులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో జరగనున్న సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా పలు వస్తువులు సరఫరా చేసేందుకు దేవదాయ శాఖాధికారి కెవి.అనురాధ సమక్షంలో శుక్రవారం సీల్డ్ టెండర్లు స్వీకరించారు. అనంతరం టెండర్దార్ల సమక్షంలో వచ్చిన సీల్డ్ టెండర్లను ఓపెన్ చేసి తక్కువ కోట్ చేసిన అభ్యర్థుల పేర్లను తెలిపారు.

ఆలయ ఈవో పి.లోకేశ్వరి మాట్లాడుతూ ఆలయంలో నిర్వహించే సంక్రాంతి–2024 ఉత్సవాలకు సంబంధించి వివిధ పనులు గ్రామోత్సవానికి సన్నాయి వాయించుటకు చాగంటిపాటి కల్యాణ్, డప్పులు చిన రోశయ్య, తీన్మార్ ప్రకాష్‌బాబు, తెప్ప ఏర్పాటుకు ఎం.సహదేవుడు, భోజనాలు సప్లయి చేసేవారిని ఏర్పాటు చేయడానికి సూరిబాబు, అమ్మవారి రథం లైటింగ్‌కు కిరణ్‌కుమార్, షామియానాకు నవీన్‌కుమార్‌లు తక్కువ మొత్తంలో సీల్డ్ టెండర్లు సమర్పించారని వెల్లడించారు. ఈ జాబితా తుది నిర్ణయానికి దేవదాయశాఖ ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

సూక్ష్మ కళ.. భళా..



కొబ్బరికాయతో పూరి జగన్నాథుడి ఆలయం నమూనా

- మైక్రో ఆర్ట్స్‌తో గుర్తింపు పొందుతున్న యనమలకుదురువాసి సుజాత
- తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు
- బల్లి గుడ్డు, ఉసిరి, టూత్‌పిక్‌లపై ఆర్ట్



కోడిగుడ్డు, బల్లి గుడ్డు, జీడిపప్పు, బాదం పప్పుపై ఇండియా మ్యాప్



సుజాత

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఇంటి పనులు పూర్తయిన తర్వాత ఖాళీ దొరికితే చాలు.. టీవీ సీరియల్స్ చూస్తే కాలక్షేపం చేయకుండా కాస్త భిన్నంగా ఆలోచించి సూక్ష్మ కళపై దృష్టి పెట్టారు. యనమలకుదురుకు చెందిన 55 ఏళ్ల నడకుదిటి సుజాత. కళాత్మక దృష్టితో పెన్సిల్ మొనతో మంచి ఆకృతులను తయారుచేస్తున్నారు. నిత్యం పత్రికలు చదువుతూ వాటిలో మైక్రో ఆర్ట్స్‌పై వచ్చిన కథనాలను చదివి తాను కూడా ఇలా ఎందుకు చేయకూడదు అనే ఆలోచన సుమారు ఏడేళ్ల క్రితం వచ్చింది. ఆమె వెంటనే దానిని ఆచరణలో పెట్టారు. ఉసిరి చెట్టు ఆకులపై అక్షరాలు, కోడి, వివిధ పక్షులు పెట్టే గుడ్లపై వివిధ రకాల బొమ్మలు వేస్తూ స్థానికంగా గుర్తింపు తెచ్చుకున్నారు. స్వాతంత్య్ర దినోత్సవం, వివిధ పండుగలు, క్రికెట్ మ్యాచ్‌లు ఇలా సందర్భాన్ని బట్టి కోడి గుడ్లపై బొమ్మలు గీయడం సుజాతకు అలవాటుగా మారింది. పాత నాణేల సేకరణ, కరెన్సీ నోట్లపై ఉన్న నంబర్లలో బంధువులు, స్నేహితుల పుట్టిన రోజు, పెళ్లి రోజులను గుర్తించి వాటిని సుజాత బహుమతిగా వారికి అందజేస్తుంటారు. ఈ వైవిధ్యమైన కళను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు గుర్తించి ఈ ఏడాది ఆగస్టులో సుజాత పేరుతో రికార్డ్ నమోదు చేసుకుని గుర్తింపు పత్రాన్ని అందజేశారు.

అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి విశేషంగా కుంకుమార్చనలు, శ్రీచక్రార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను ఆదివారం సాయంత్రం 3 గంటలకు వేలం వేయనున్నట్లు శరాబందీరావు తెలిపారు.

మహిళా ప్రగతిని స్వాగతించాలి

విజయవాడ కల్చరల్: మహిళా ప్రగతిని స్వాగతించాలని స్వరాంజలి సంగీత సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకురాలు వడ్డాది కామేశ్వరి సూచించారు. స్వరాంజలి సంగీత సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికమీద శుక్రవారం మహిళా సంకల్ప దివస్, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు.

కామేశ్వరి మాట్లాడుతూ మహిళల ఆర్థికంగా ఎదగాలని సూచించారు. సంస్థ సభ్యురాలు గరికపాటి కనక దుర్గ ప్రసంగించారు. సినీ సంగీత విభావరిలో భక్తి, క్లాసికల్ గీతాలను ఆలపించారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

రేపు నగరాల వన సమారాధన

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నగరాల ఐక్యవేదిక ఏపీ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ ఆదివారం కొత్తూరు తాడేపల్లిలో వనసమారాధన జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. కొత్తూరు తాడేపల్లిలోని శశివర్మ తోటలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు. 9 గంటలకు సత్యనారాయణ స్వామి వ్రతం, 10 గంటలకు మహిళలు, చిన్నారులకు ఆటల పోటీలు, ఉదయం 10.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 11 గంటలకు సభాప్రారంభంతో పాటు పలువురు వక్తలు మాట్లాడతారు. సభ అనంతరం బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

- ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ ఆదివారం భవానీ ఐలాండ్‌లో కార్తిక వన సమారాధన నిర్వహిస్తున్నారు.